# మా తెలుగు తల్లికి మల్లెపూదండ

"గోపాలకృష్ణుడు నల్లన గోకులములో పాలు తెల్లన కాళిందిలో నీళ్ళు చల్లన పాట పాడంగ నా గుండె ఝల్లన..."

కమలమ్మ కళ్ళు చెమర్చాయి. ఆ పాట, ఆ కమ్మని గొంతు, తన మనస్సుని వేగంగా వెనక్కి గతించిన గతం లోకి లాక్కువెళతాయి. పూపొదరిల్లు లాంటి తమ పల్లెటూరు... అడుగడుగునా అలరించే హరిత బంగారం...పుడమితల్లి పలకరింపుల్లాంటి ఉదయ కుసుమాలు... పైరు గాలి పారవశ్యానికి పరుగులు పెట్టే చిరుపాదాలు... నిజంగా బాల్యం బంగారు కల!

అది తన మనస్సులో ఎన్నటికీ చెరిగిపోని కల!

కమలమ్మ కళ్ళు తుడుచుకుంది.

'టేప్ రికార్డరు' ఆపి, అల్బమ్ అందుకుంది.

ఒక్కొక్క పుటని మురిపెంగా చూస్తు తిరగవెయ్యసాగింది. అందులో ఆమె బాల్యం ఉంది. అందమయిన గతం ఉంది. తెలుగు తల్లికి పట్టు పావడాలాంటి ఆమె సొంత ఊరు అపురూపమయిన పల్లెటూరు ఉంది. విశాలమైన అవరణతో వైభవోపేతంగా దర్శనమిచ్చే తండ్రి గారిల్లు ఉంది. ఆ ఇంటిముందు – తెలుగుతల్లికి నీరాజనాలిస్తున్నట్లు రంగవల్లులు ఉన్నాయి. ఆ రంగవల్లులు తీర్చిదిద్దుతున్న కన్నె కమలమ్మగా, ఆమె ఆ 'ఆల్బమ్' లో ఉంది.

ఆమె మనసుని నిత్యసంతోషిగా ఉంచే శక్తి ఆ 'అల్బమ్'కి ఉంది. అది ఆమె బహిప్రాణం. రోజూ ఒక్కమాటయినా 'ఆల్బమ్' ని చూడకపోతే ఆమెకు తోచదు. అలాగే 'టేప్ రికార్డరు'లో పాతకాలం నాటి పాటలు వింటే గానీ రోజు గడిచినట్లుండదు. పాతికేళ్ళుగా తెలుగు నేలకి దూరంగా ఉంటూ కూడ, మానసికంగా ఉల్లాసంగా ఉండగలగటానికి ఈ దినచర్యే కారణం.

చదువుకునే రోజుల్లో, స్కూల్లో ఆమె చేత తెలుగు తల్లి వేషం వేయిస్తుండేవారు చక్కటి నృత్యనాటిక, కమ్మని పాటలతో రక్తి కట్టేది. మాస్టర్లు ముద్దుగా ఆమెని 'తెలుగు తల్లి' అని పిలిచేవారు. ఆమె కూడా ఆ పిలుపుకి అలవాటుపడిపోయింది.

"మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అనే పాట పాడినంతసేపు ఆమె చిరునవ్వులు చిందిస్తు బొమ్మలా నిలబడేది. ఒక చేత్తో అభయముద్ర దాల్చి, రెండో చెయ్యి విలాసంగా వదిలేసి, రంగస్థలం మీద నిలబడి ఉన్నప్పుడు, సాక్షాత్తూ తెలుగుతల్లి అవతరించిందా అన్నట్లుండేది. ఆ ఫోటో కూడా 'అల్బమ్'లో ఉంది.

ఆమె ఆ ఫోటో దగ్గరే ఆగిపోతుంది.

ముందుకు వెళ్ళాలనిపించదు.

ఆ తర్వాత పుటల్లో ఆమె వివాహదృశ్యాలు, తల్లిదండ్రులు తనను అప్పగింతలు పెట్టటం... ఆ అప్పగింత తెలుగుదేశానికి దూరంగా ఉన్న అమెరికాకి అని, తన నిత్యస్వర్గం నుంచి వంచితురాలవుతున్నానని, బందీగా చక్రాల కుర్చీకి అంకితమై పాతికేళ్ళ వలంబనాన్ని తట్టుకోవాల్సి వస్తుందనీ.... ఆనాడు అనుకోలేపోయింది.

భర్త అమెరికాలో సుప్రసిద్ధ సైంటిస్టు. తాను కాపురానికి వెళ్ళిన రెండో సంవత్సరంలోనే విధి వక్రించి 'లిఫ్ట్' ప్రమాదంలో వెన్నెముకకి గట్టి దెబ్బతగిలి, మంచం పట్టింది. అప్పటికే చందన ఆరునెలల పాప, అలనాపాలనా భర్త సత్యమూర్తే స్వయంగా చూసుకునే వాడు, తనని, అతని శరీరంలో ఒక భాగంలా కంటికి రెప్పలా కాపాడుకునే వాడు. అదే తన అదృష్టం! తలుచుకుంటే సత్యమూర్తికి సునాయాసంగా మరో భార్య లభించి ఉండేది. అందుకు శ్రేయోభిలాషుల పేరుతో కొందరు ప్రయత్నాలు కూడా చేసారు. తనవంతు కర్తవ్యంగా, తన అభ్యంతరం ఏమీలేదని కూడా చెప్పింది.

సత్యమూర్తి నవ్వి "వివాహం శరీరానికి పరిమితమయితే వ్యభిచార మవుతుంది. తనువు, మనసు ఏకమైతేనే అది దాంపత్యం. మనం దంపతులం కమలా! ఇంకెప్పుడూ ఇలాంటి చర్చ మనిద్దరి మధ్య రానివ్వకు" అన్నాడు మృదువుగా మందలిస్తూ.

ఆ ప్రేమకి ఆనందించాలో, తన వల్ల ఆయనకు కలిగే ఆసౌకర్యానికి చింతించాలో అర్థంకాలేదు. కాలగమనాన్ని క్యాలెండర్లలో చూస్తు, తాను కోల్పోయిన బాల్య యౌవనాలను, తన ముద్దుబిడ్డ చందనలో చూస్తు పాతికేళ్ళు గడిపేసింది. ఒక్కటే తృప్తి ఆమెకు. చందన ముమ్మూర్తులా ఆమె పోలికే. అలవాట్లు, అభిరుచులూ అన్నీ ఆమెవే! అవటానికి అమెరికా దేశమయినా, ఆ ఇంటివరకు- తెలుగుదేశంలోని ఓ అందమయిన ముక్కను వేరు చేసి తెచ్చి అక్కడ అతికారా అన్నట్లు, అడుగు తీసి అడుగు వేస్తుంటే, అన్నివైపులా తెలుగు దనం ఉట్టిపడుతు, మనసును హర్షపులకితం చేస్తుంది. అప్పుడే వేసారా అనిపించే రంగవల్లులు ఆహ్వానిస్తుంటే, తులసికోట గూటిలోని ప్రమిదలు, చిరువెన్నెల కిరణాలు వెదజల్లుతు చీకట్లను తరుముతు ఉంటాయి. పసుపురాసిన గుమ్మాలు దాటగానే ఎదురుగా 'శరణం వ్రజ' అంటున్న శ్రీనివాసుని దివ్యదర్శనం లభిస్తుంది.

ఇల్లంతా ప్రశాంత నిశ్శబ్ద వాతావరణం తపోవనాన్ని తలపిస్తుంది. ఒక్కొక్కప్పుడు

శ్రవణానంద స్థాయిలో రమ్యంగా తెలుగు సంగీతకారుల ప్రావీణ్యం, వాయుదేవుడికి విందుచేస్తుంటుంది.

ఇదంతా ఆ ఇల్లాలి అభిరుచులను బట్టి సత్యమూర్తి చేసిన ఏర్పాట్లు, కమలమ్మ అనారోగ్యంలో కూడ ఆనందంగా, ఆహ్లాదంగా ఉండగలగ టానికి ఇదే కారణం.

అమెరికా వెళ్ళటం జరిగింది కానీ, కమలమ్మకి తమ గ్రామం చూసే అవకాశం ఇంతవరకు మళ్ళీ కలుగలేదు. అమె నిస్సహాయస్థితి అలాంటిది. తల్లి పోయింది. వెళ్ళలేకపోయింది. తమ్ముళ్ళకి, చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళయినాయి... వెళ్ళలేకపోయింది. తండ్రి గతించాడు. ఇక్కడి నుండే అశ్రుతర్పణం విడిచింది.

తండ్రి ఆమెను అపురూపంగా పెంచాడు. ఆమె పుట్టాక ఆ ఇంట్లో సిరి తాండవించింది. అందుకే ఆయనకు ఆమె ఆరో ప్రాణం. ఆయన ప్రాణంపోయే సమయంలో ఎంత అవేదన చెందాడో... ఆయన ఆత్మ ఎంత ఘోషించిందో, ఆ ఊహ కమలమ్మ మనసును పిండివేసింది. ఈ పాతికేళ్ళూ సత్యమూర్తి కూడ తెలుగుదేశం చూడలేదు. భార్యతోనే ఉండిపోయాడు.

చైనా నుండి సూదుల వైద్యం చేసే నిపుణుడు వచ్చాడని తెలిసి, సత్యమూర్తి ఇంటికి ఆహ్వానించి, భార్యని చూపించాడు. క్షుణ్ణంగా పరీక్షచేసి, నెలరోజుల్లో తప్పక నయమవుతుందని భరోసా ఇచ్చి, ఆరోజు నుండే వైద్యం ప్రారంభించాడు. దాని ఫలితంగా ఎక్కువసేపు చక్రాల కుర్చీలో తిరగ్గలుగుతోంది. రోజురోజుకీ అభివృద్ధి కనుపిస్తోంది. నెల అవుతుండగా కూతుర్ని పట్టుకుని మెల్లగా అడుగులు వేయగలిగింది.

మరో వారంరోజుల్లో నిదానంగా, ఎవరి సహాయమూ లేకుండా కమల నడవ గలిగింది. సత్యమూర్తి చైనా డాక్టరుని అభినందనగా ఆలింగనం చేసుకుని కన్నీళ్ళు కార్చాడు. అతని పాతికేళ్ళ మానసికవ్యధ నెలరోజుల్లో కరిగిపోయింది. అతని సహనానికి, ఓర్పుకి, మంచి తనానికి బహుమతి లభించినట్లు కమల తిరిగి మామూలు మనిషి అయింది.

ఆరోజు ఇంట్లో పండుగలా గడిచిపోయింది.

భార్యభర్తలు ఒకరినొకరు కౌగలించుకుని, ఇన్నేళ్ళుగా పేరుకుపోయిన మానసిక వ్యధంతా కొట్టుకుపోయేవరకు వెక్కివెక్కి ఏడ్చారు. చందన తల్లి ఆరోగ్యం కుదుట పడినందుకు శ్రీనివాసుడి పాదాలు కన్నీటితో కడిగింది.

ఆ ఇంట్లో అవే చివరి కన్నీళ్ళు!

అప్పటినుండీ అక్కడ ఆనందం తాండవించింది.

కమల టేప్‌రికార్డరు బదులు తనే స్వయంగా పాడుతోంది!

ఆమె గొంతుగూడులో కొత్తకోయిల కళ్ళు విచ్చి, కలస్వనాన్ని సవరించుకున్నట్లుంది.

అది ఆనంద తరంగ రవళి. అదే జీవనవిపంచి నుండి వెలువడే విచిత్ర సంగీత మాధురి.

ఆ రాత్రి ఏకాంతంలో సత్యమూర్తి అన్నాడు.

"కమలా! నీ ఆరోగ్యం కుదుటపడింది. ఇన్నాళ్ళు నేను, నువ్వు మనవాళ్ళందరికీ దూరంగా ఉన్నాం. శుభానికి, అశుభానికి కూడ వెళ్ళలేకపోయాం. నువ్వు సరేనంటే, మనం ఒకమాటు మన దేశానికి వెళ్ళివద్దాం..."

"నేనే అడుగుదామనుకుంటున్నాను. తప్పక వెళదామండీ. మీతో కాపురానికి వచ్చే ముందు, చివరిసారిగా మీ ఊరుని చూసిన దృశ్యం అలాగే నా మనసులో ముద్రపడిపోయింది. మన చందన తెలుగునేల చూసి ఎరుగదు. అల్బమ్ ఫోటోల నుండీ, నా మాటల నుండీ గ్రహించుకున్న విషయాలతోనే తృప్తిపడుతోంది పిచ్చిపిల్ల! ఇప్పుడు మన గ్రామాలు ఎంతో అభివృద్ధి చెంది ఉంటాయి. తెలుగు సంస్కృతి వెల్లివిరిసి ఉంటుంది. మీ తెలుగు మాస్టారు ఏం చేస్తున్నారో... ఇప్పుడు తెలుగుతల్లి నాటకం వేస్తున్నారో లేదో... నేను వాళ్ళకి గుర్తున్నానో లేదో... ఆనందరావు మాస్టారు గుడి మండపంలో చదువు చెప్పేవారు. చేతిలో ఈతబెత్తాలు పుచ్చుకుని ఎక్కాలు తప్పు చెప్పినప్పుడల్లా వీపు మీద వడ్డించేవారు..." నవ్వింది కమలమ్మ.

సత్యమూర్తి కూడ నవ్వేడు.

"పేరుకు తెలుగునేలకి దూరంగా ఉన్నావు కానీ, నీ మనసు నిండా తెలుగుదనమే! నీ కూతుర్ని కూడ, నీ అభిరుచికి తగినట్లు తీర్చిదిద్దుకున్నావు. నీకు వచ్చిన విద్యలన్నీ నేర్పావు ఆమెరికా నాగరికత ప్రభావం లేశమయినా పడకుండా పెంచావు. ఈరోజుల్లో నీలా ఎవరుంటారు కమలా?"

"అదంతా మీ సహకారం వల్లనేగా సాధ్యమయింది"

"మంచిని ప్రోత్సహించక పోవటం నేరమనేవారు మా నాన్న. నేనా మాట నమ్ముతాను. అందుకే నీకు పూర్తి స్వేచ్ఛ యిచ్చాను. మంచంలో ఉన్నా మంచిగంధం లాంటి సౌజన్యంతో ఈ ఇంటిని ఏలావు... కమలా! నువ్వు భార్య కావటం నా అదృష్టం..." ఆమెను అక్కున అదుముకున్నాడు.

"మీ భార్యకావటం నా అదృష్టం కూడా..." మనస్ఫూర్తిగా అంది.

000

ఇంటి ముందు కారు ఆగగానే. పిల్లలు పరుగెత్తుకుంటు వచ్చారు.

కమల పరిసరాలు పరీక్షిస్తూ మెల్లగా కారు దిగింది. సత్యమూర్తి ఆమె దిగటానికి సహాయపడ్డాడు. చందన తల్లికి ఆసరాగా పక్కనే ఉంది. ప్రయాణ బడలికతో కమలకాళ్ళు పట్టేసాయి. అందుకని మెల్లగా నడిచింది.

డ్రైవరు సామానులు లోపలకి జేరవేసాడు. కమల ఆ ఇంటి పరిసరాలలో వచ్చిన

మార్పులు చూపులతోనే గమనించసాగింది. తల్లీ తండ్రీ లేని లోటు స్పష్టంగా కనుపిస్తోంది. ఇంటిగోడలు బీటలు వారేయి. ఇంటిముందు రంగవల్లులు లేవు. పచ్చతివాసీ పరచినట్లు కంటికింపుగా ఉండే దొడ్డి వెలాతెలా పోతోంది. అక్కడక్కడ మొక్కలు సగం ఎండి దీనంగా ఉన్నాయి.

తమ్ముళ్ళు ఆప్యాయంగా పలకరించి మర్యాదలు చేశారు. మరదళ్ళు మనసు విప్పి మాట్లాడారు. కమల ఇల్లంతా తిరిగింది. ఆమెకు గతమంతా కళ్ళముందు మెదిలింది. కన్నీళ్ళు పొంగివచ్చాయి. ఇంకా తల్లి ఏదో మూల పని చేసుకుంటున్నట్టే ఉంది. తండ్రి కంచుకంఠం చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. హాలు మధ్యగోడకి వీపానించి, వీధివాకిలి దొడ్డి వాకిలి చూస్తు, చల్లగాలి అనుభవిస్తు, ఛలోక్తులతో నవ్విస్తు, పెద్దగా నవ్వుతుంటే తండ్రి రూపం కళ్ళముందు మెదిలింది.

గుడి ఉంది. దేవుళ్ళు వెళ్ళిపోయారు.

విశ్రాంతిగా కూర్చుని, ఊళ్ళో తెలిసిన వాళ్ళ గురించి పేరుపేరునా అడిగింది కమలమ్మ. పక్కనే కూర్చుంది చందన. ఇద్దరూ తల్లీకూతుళ్ళలా లేరు. అప్పచెల్లెళ్ళులా ఉన్నారు. కొందరు కమలమ్మ వచ్చిందని చూడటానికి వచ్చారు.

వచ్చినవాళ్ళలో చనువుగలవాళ్ళు "ఏం తెలుగుతల్లీ! ఇన్నాళ్ళకి మమ్మల్ని చూట్టానికి వచ్చావా?" అన్నారు నిష్ఠురంగా.

నవ్వి ఊరుకుంది.

కాలంతో ఎన్నిమార్పులు! తనలో మార్పు తనకి తెలియటంలేదు, కానీ, అవతలివాళ్ళలో వయసు ముద్రలు చూసి విస్తుపోయింది.

"అమెరికాలో పాతికేళ్ళున్నావంటే ఎంతో ఫ్యాషన్‌గా ఉంటావనుకున్నాం. నీ డ్రస్సులు చూద్దామని వచ్చాం. నువ్వు కూడా రాత్రిళ్ళు గౌన్లు వేసుకుంటావా? అదేమిటి... మీ అమ్మాయికి బుట్టలోలాకులు తగిలించావ్? ఛీ... ఏం బాగాలేదు... కనీసం పంజాబీడ్రెస్సు కూడ వెయ్యకుండా ఆ పాతకాలం పట్టు పరికిణీ ఏమిటి? ఇప్పుడు పల్లెటూళ్ళ లోనే పంజాబీ డ్రెస్సులు, నైటుగౌన్లు వేస్తున్నారు..." ఇలా సాగింది సంభాషణ.

కమలమ్మ వాళ్ళని చూసి మొదట జాలిపడింది. మరికాస్సేపటికి కంపరమినిపించింది. చివరికి బలవంతాన విడిపించుకుని తమ్ముళ్ళు కట్టుకున్న ఇళ్ళవైపు వెళ్ళింది.

'అత్తా. అత్తా' అంటు పిల్లలు చుట్టుముట్టారు. వాళ్ళందరికీ బహుమతులు ఇచ్చింది. ఇంకా ఏమైనా తెస్తే బావుండేది అనుకుంది వాళ్ళ మొహాల్లో ఆనందం చూసాక కాలక్షేపం కబుర్లు అయినాక, విషయం చదువుమీదకి మళ్ళింది.

కమలమ్మ ఎంతో కుతుహలంగా వాళ్ళ కొచ్చిన పద్యాలు వినిపించమంది. 'పద్యాలా? మాకేం రావు' అనేశారు. ఖరాఖండీగా. ఆమె తెల్లబోయింది. చిన్నప్పుడు తండ్రి స్వయంగా

వేమన శతకం, రుక్మిణి శతకం, నీతి పద్యాలు పల్లె వేయించేవాడు. ఇప్పుడు వీళ్ళకి ఏమీరాక పోవటమేమిటి? చందనకి అన్నీవచ్చు. తనే నేర్పించింది.

"మరి మీకేం వచ్చు?" అడిగింది కమల.

వెంటనే తలొక ఇంగ్లీషు పద్యం అప్పజెప్పారు.

చందన తల్లికేసి జాలిగా చూసింది.

ఉన్నట్టుండి ఆ పిల్లల్లో ఒకడు చందనని అడిగాడు "నువ్వు మీ మమ్మీని అమ్మా అని పిలుస్తావేం?" అని.

చందన ఆ ప్రశ్నకి బిగుసుకుపోయింది.

పల్లెటూళ్ళో కూడా తల్లిని ఆప్యాయంగా 'అమ్మా' అని పిలవటం నామోషీ అనుకుంటున్నారా?

కమల కూతురుకేసి చూస్తూ నిస్సహాయంగా నిట్టూర్చింది. తను ఇన్నాళ్ళూ తెలుగుతల్లి వైభవం గురించి కలలు కన్నది. పల్లెటూళ్ళు తెలుగు సంస్కృతికి పట్టుకొమ్మలనే భ్రాంతిలో మునిగిపోయింది. తను ఇందాక పరిచయస్థుల నుండి విన్నదాని ప్రకారం, రైతులు చాలామంది పొలాలమ్ముకుని పట్నం వలస వెళ్ళిపోయారు. అక్కడ వ్యాపారాలు చేస్తు, విలాస జీవితాలు గడుపుతున్నారు. కొందరు సినిమాలు తీస్తున్నారు. ఆర్థికంగా పతనమై పోతున్నారు. ఒకనాడు పల్లెటూళ్ళలో పల్లవించిన కళాస్వరూపాలన్నీ కాలగతిలో కరిగి పోయాయి. హరికథలు, బుర్రకథలు, తోలుబొమ్మ లాటలకు కాలం చెల్లిపోయింది. ఆ కళాకారులు యాచకులై పొట్ట నింపుకుంటున్నారు. వృత్తిధర్మాలు మారిపోయాయి. వ్యసనాలు అధికమైనాయి. సోమరితనం బలిసిపోయింది. పంటలిచ్చే పసిడిపొలాలు, పైకం కోసం చెరుకు దాహానికి ఆహుతైపోతున్నాయి. నిజాయితీ నశించిపోయింది. శీలం విలువపోయింది.

కమలకి ఏదో పాపకూపంలోకి ప్రవేశించి నట్లనిపించింది. తను ఇన్నాళ్ళు శారీరకంగా అమెరికాలో ఉన్నా. మానసికంగా తెలుగుతల్లి ఒడిలోనే ఉంది.

వీళ్ళు తెలుగుతల్లి ఒడిలో ఉన్నా మానసికంగా కుళ్ళిపోయిన నాగరికతలో పొర్లుతున్నారు!

"తెలుగుతల్లీ! నీ మెడలో ఈ ముళ్ళదండ, పోయి మళ్ళీ మల్లెపూదండ ఎప్పుడు అలంకరించ బడుతుందో కదా" అని కుమిలిపోయింది కమలమ్మ. ఆ మర్నాడే వాళ్ళు తిరుగుప్రయాణం అయినారు.

(జాగృతి కథానికల పోటీలో బహుమతి పొందిన రచన)